# ఎర్రమేఘం

'వేట ప్రభాస్'




వాళ్ళు వెళ్ళిపోయారు.

దండ తెగి, రాలిపడుతున్న ముత్యాల్లా వర్షం చినుకులు మొదలవుతుంటే, గబగబా నడిచి వెళ్ళిపోయారు. ఉండమంటే వినలేదు. 'భారీవర్ష సూచన' ప్రకటన గురించి కూడా చెప్పాను... కనీసం వంట మనిషి వండిపెట్టి పోయిన అన్నం అయినా తినేసి వెళ్ళమన్నాను... వాళ్లనలు పట్టించుకోనేలేదు.

"మేవేటీ మొక్కమొలిసి పోం..." అని క్లుప్తంగా చెప్పేసి, వచ్చినపని అయిపోయిందన్నట్టుగా హడావుడిగా అగ్నిపర్వతం మీద అడుగులు వేస్తున్న వాళ్లలా తొందర తొందరగా తడుస్తూనే వెళ్ళిపోయారు.

నేనింకేమీ అనలేకపోయాను... అనీ లాభం లేదు.. కొండ మనుమలు వాళ్ళు మరి... కొండలాంటి ధైర్యం వాళ్ళది.



**ప్రథమ బహుమతి పొందిన కథ**

నేనలాగే వరండాలో వాలు కుర్చీలో కూర్చుని వాళ్ళు వెళ్ళిన వంకే చూస్తూ ఉండిపోయాను. కనిపిస్తున్న మేరకు ఆకాశం నల్లగా మేఘావృతమై ఉంది. ప్రకృతి అంతా చీకటి దుప్పటి పరుచుకుంటోంది. వాతావరణంలో విపరీతమైన మార్పు వచ్చింది... నా మనస్థితిలాగే...

గంట కిందట ఇలా లేదు. అస్తమించబోతున్న అందమైన సూర్యకాంతిలో ఆకాశం ఎర్రరంగు పూసుకున్న మేఘాలతో ఆకర్షణీయంగా ఉండేది. గంటలోనే ఈ మార్పు... వర్షం పెద్దదైంది. గాలి కూడా వేగంగా వీస్తోంది. ఇంటి ముందు ఆవరణలో ఉన్న పూలమొక్కలు దబదబ పడుతున్న వర్షానికీ, తెరలుతెరలుగా వీస్తోన్న ఈదురుగాలికీ వొంగిపోతూ, ఊగిపోతూ నృత్యం చేస్తున్నట్టుగా ఉన్నాయి.

చలిగా అనిపించి, శాలువా ఒంటి నిండా కప్పుకుని సర్దుకుని కూర్చున్నాను. శాలువా మెత్తగా ఉంది. వెచ్చగా ఉంది. ఈ మధ్యనే నాకు జరిగిన సన్మానంలో కప్పిన కొత్తశాలువా అది. దాన్ని సర్దుకుంటూ ఉంటే నాకు ఆంధ్రదేశమంతటా అఖండమైన కీర్తి ప్రతిష్ఠలు తెచ్చిపెట్టిన నా "అగ్నిప్రవేశం" కవితా పంక్తులు జ్ఞాపకం వచ్చాయి.

"సూర్య రథం కదులుతోంది...!
జైత్ర యాత్ర సాగుతోంది...!
జనగణమంతా పెను
ప్రవాహమై ఉరుకుతోంది...!

ఎప్పుడు రాసినవి...? ఇరవై ఆరో, ఇరవై ఏడో ఏళ్ళ కిందట... ఈ రోజుకీ ఇంకా ఆ పుస్తకం ముద్రణలు జరుగుతూనే ఉన్నాయి. ఎక్కడో ఓ దగ్గర ఏవేవో సభల్లో జనం ఉద్రేకంగా నా కవితా పంక్తులు ఉచ్చరిస్తూనే ఉన్నారు.

నేనిప్పుడు నా జీవిత సంధ్యా సమయంలో ఉన్నాను. నా శారీరక స్థితితోబాటు మానసికంగా కూడా నాలో చాలా మార్పు ఈ మధ్యకాలంలో వచ్చింది. కుడి కన్ను కనబడటం మానేసి రెండేళ్ళు దాటుతోంది. మైల్డ్‌గా వచ్చిన పెరాలసిస్ స్ట్రోక్ వలన ఇంట్లోనే తప్ప బయటికి వెళ్లడమే పూర్తిగా మానేశాను. నా కోసం నిరీక్షించి, నిరీక్షించి అలిసిపోయిందో, లేక నాతో జీవితం చివరివరకూ నడిచి వచ్చే ధైర్యం లేకనో, సీత, ఐదేళ్ళ క్రిందట నేను మహారాష్ట్ర అడవుల్లో అజ్ఞాతంగా ఉన్నప్పుడు కాలం చేసింది.. ముప్పై ఏళ్ళ వయస్సొచ్చి పోస్టు గ్రాడ్యుయేషన్ మంచి మార్కులతో పాసైన నా ఒక్కగానొక్క కొడుకు ''క్రాంతి'' బ్యాంకులో వచ్చిన పాడిఆవులాంటి ఉద్యోగం విడిచిపెట్టి, నేను చూపిన నిప్పుల మార్గంలోకి, తెలిసి ఏదో ఆకర్షణ లాగితే నాకు సైతం చెప్పకుండా నడిచిపోయి నాలుగేళ్లవుతోంది.

ఇందాక వాళ్ళొచ్చి చెప్పగానే వాడి గురించి తెలిసింది...

కళ్ళద్దాలు మసకబారినట్టుగా అనిపించి, కుడి చేత్తో తీసి, అంతగా పనిచెయ్యని ఎడమ చేత్తో పట్టుకుని, శాలువా అంచుతో తుడిచాను.

ఎండిపోయిన చెరువు అడుగున కొద్దిగా ఊట నీరుండి పోయినట్టుగా నా గుండెలోతుల్లో ఇంకా ఎక్కడో ఆర్ద్రత మిగిలిపోయినట్టుంది. కళ్ల నుంచి అప్రయత్నంగా కన్నీరు వస్తోంది.

నేను తుడుచుకునే ప్రయత్నం చెయ్యలేదు.

కవిత్వంగానీ, కన్నీరుగానీ, ధారగానే రావాలి.. మనస్సు తేలిక పడాలంటే... ''మా ముటాలో పాతిక గూడేలుంటాయి బావూ...! మా అందరికీ బాబు మాటే... మాట...! ఆ బాబంటే మా అందరికీ గొప్పగురి...''

ఊలక దొర ఆ మాటలు అంటూ ఉంటే అతని గొంతులో ఆరాధన స్పష్టంగా తెలిసింది. నాకు మొదటిసారిగా గుండెల్లో భయం అప్పుడే అడుగుపెట్టింది.

నల్లటి మేఘాలు బయట పూర్తిగా చీకటిని సృష్టించాయి. ఉండీఉండీ మెరుపులు, సభల్లో వెలిగే కెమెరా ఫ్లాష్‌ల్లా మెరుస్తున్నాయి. వాన జోరు హెచ్చింది.

''వాడి తల విలువ ఏభై వేలట...!''

తెలి ప్రభుత్వం రోజుల్లో నా తలకీ కొన్నేళ్ళపాటు వెయ్యి రూపాయల విలువ పెట్టారు...

అప్పట్లో మా నాయకులు ప్రయత్నాలు ఫలించడం వల్లో, నాలోని కవితాశక్తిని అభిమానించే ప్రజానీకం సానుభూతి వల్లనో నేనెక్కువ రోజులు అజ్ఞాతంగా ఉండ నక్కరలేకపోయింది.

లేచి వెళ్ళి వరండాలో లైటు స్విచ్ వేసి వచ్చికూర్చున్నాను... నారాయణ ఇంకా రాలేదు... ఎవరూలేని ఇంట్లో నిశ్శబ్దం నెమ్మదిగా గూళ్ళు కడుతోంది...




వరండాలో నుంచి పడుతున్న లైటు వెలుగుకి, కిందపడి, పైకి చిందుతున్న వర్షపు చినుకులు, ముత్యపు బంతుల్లా ధగధగా మెరిసిపోతున్నాయి.

నా కుర్చీ ప్రక్కనున్న స్తంభం పక్కగా, కింద ఉన్న మెట్ల వారగా బారులు తీరిన చీమలు నిర్భయంగా ఇంట్లోకి నడుస్తున్నాయి.

వర్షం దిశ మారింది...

ఓ గాలి తెర విసురుగా వరండాలోకి దూసుకొచ్చింది. దానితోపాటు వర్షపు జల్లు కూడా... వాన నీటికి నా కాళ్ళు తడిసాయి.

చీమలన్నీ హడావుడిగా చెదిరిపోయాయి.

నేను లేవలేదు. నాకు లేచి వెళ్లాలనీ అనిపించలేదు.. ఆ మనస్సులో చెలరేగుతున్న భావాల వరంవర నన్ను అశక్తుడ్నీ ఆలోచనామగ్నుడినీ చేస్తోంది.

ఇప్పుడిక ఏమీ లేదు...

జవసత్వాలు జరాధీనమైపోయి, చైతన్యం చరిత్రగా మిగిలిపోయే దశకు చేరుకున్నాను..

జనం... జాగృతి... శ్రేయోరాజ్యం... వ్యవస్థ పునర్నిర్మాణం... ఆకలి... కేకలు.. ఆలోచనాగ్ని కీలలు.... నిద్రలేని రాత్రులు... నిరంతర వేదనలు... శపిస్తున్నట్టుండే సీత మౌన దృక్కులు... ఎత్తుకుని, ఎప్పుడైనా దగ్గరకు తీసుకుంటే క్రాంతి చూసే బెదురు చూపులు... మధ్యమధ్య రాసిన ఒక్కో కవితా సిరా బాంబులా పేలుతూ ఉంటే ఉప్పెనలా వచ్చిపడుతుంటే జనం మెచ్చుకోళ్ళు... జైలు జీవితం... అభిమానుల ఆవేశాలు... ఎన్నెన్నో చీకటి గుహ ప్రవేశాలు... ఎండమావుల్లా కళ్ళు మిరుమిట్లు గొలిపే తేజో పుంజాలు.

ఏమీ లేవు... ఇప్పుడిక ఇంకేదీ ఉండబోదు... నాలో భ్రాంతి తొలగిపోయింది... చాలా ఆలస్యంగా...

జీవితపు చేలాంచల తళతళలు, తొణికిసలాడే యవ్వనపు చైతన్య వైభవాలూ.. నిర్మలమైన ఆనంద మందాకినీ మలయమారుతాలు, ఏవీ అనుభవంలోకి రాకుండానే, గడియారంలో గడిచిపోయిన కాలంలా మారిపోయాయి.

బయట చిక్కటి చీకటి అలుముకొంది.

మనస్సులో పరితాపం వెల్లువైంది. అరవై ఏళ్లపైనే పదిలంగా పేర్చుకుంటూ వచ్చిన ఆశయ హర్మ్యాలు గాజు భవనాల్లా అంతరంగంలో కుప్పకూలిపోయాయి.

ఒక జీవితానుభవం వృధా అయ్యింది..!

ఒక యుగం పాటన్నా నిలిచిపోతుందనుకున్న కలమంచు కరిగినట్టు కరిగిపోయింది.

విప్లవం వొట్టిమాటనీ, రక్తరాగ రంజితమైన నేలమీద కొంగ్రొత్త మొలకలేవీ పుట్టవనీ నా మట్టుకు నాకు రూఢియైపోయింది. ఆలోచనకన్నా అనుభవం గొప్పది... నా అనుభవం నాకదే చెప్పింది.

ఇన్నేళ్ల ఆచరణ తర్వాత, చేరాలనుకున్న గమ్యం చీకటిదారుల్లో పడి చేరలేకపోయిన తర్వాత, వ్యాకులంగా ఉన్న నా మనస్సులో అస్పష్టంగా ఉన్న ఆలోచనలు ఒక నిర్దుష్ట రూపాన్ని సంతరించుకున్నాయి.

నాకు, ఇజాలన్నీ వొట్టి భేషజాలనీ, మానవ మస్తిష్క అర్ధగోళాలు చేసే మహేంద్ర జాలాలనీ తేటతెల్లమైపోయింది.

ఏనుగు తొండాల్లాంటి వర్షధారల్లో దాహం తీర్చగలిగేది జలార్ద్రమైన నల్లమబ్బేగానీ, ఎత్తుగా మెరిసిపోయే ఎర్ర మేఘం ఎన్నడూ కానేకాదు...

కానీ ఆలస్యం జరిగిపోయింది...! పోగొట్టు కోవాల్సినవన్నీ పోగొట్టేసుకున్నాక, చేజేతులా జీవిత మకరందం నిండి ఉన్న పాత్రను పగులగొట్టేసుకున్నాక..- చాలా... చాలా ఆలస్యంగా నాకు శాశ్వతంగా నిలబడే సత్యం... నిలిచి వెలుగిచ్చే సత్యం... తెలిసింది. కరుణ... క్రోధం కన్నా గొప్పది... శాంతి.. యుద్ధం కన్నా విలువైనది...!

క్రాంతి పుట్టాక చూసి వెళ్లిపోతున్నపుడు, పెరటి గుమ్మానికి జేరబడి పసుపు రాసుకున్న మొహంలో, పెద్దవైన సోగకళ్లల్లో, నీరు నింపుకుని నావంకే బేలగా చూస్తూ నిలబడిపోయిన సీత మొహం తటాలున జ్ఞాపకం వచ్చింది.

మరో అర్ధరాత్రి వేళ, పెరటిగోడ దూకివెళ్లి తలుపు కొడితే, అనుమానంగా తలుపు తీసి... చూసి... చూశాక గుండెల మీద వాలిపోయిన సీత...- అన్నం పెట్టమంటే, ఖాళీ గిన్నెలు చూసి, తలకొట్టుకుని ఏడ్చిన సీత..., మన బతుకు ఎందుకిలా అయ్యేయని ప్రశ్నిస్తే అప్యాయంగా చెప్పలేక నేను అతిశయంతో ఆమెకర్థంకాని భాషలో మాట్లాడితే, అయోమయంగా చూసి సమాధానపడిపోయిన సీత,....

నన్నిప్పుడు నిలబెట్టేస్తోంది... నా అంతరంగాన్ని కలవర పెట్టేస్తోంది... ''రేపటి దినం రేత్తిరేల పన్నెండు దాటేక...మే వొస్తం.. క్రాంతిబాబు మిమ్మల్ని కలుస్తమన్నరు...!''

ఊలక దొర అటూ ఇటూ చూసి గొంతు బాగా తగ్గించి మరీ చెప్పాడు... ''మీరంటే బాబుకి సానా ఇష్టం సామీ...! మానాన్న లాటోల్లు కోటి కొక్కరు పుడతారు దొరా... అంటారు బాబూ నాతో... ఆ బాబు కూడా మీకేటీ తీసిపోడు బాబూ.. రోజు నాటి మీకు రత్నం లాటి



> కథానిక ఒక మెరుపులాంటిది. రాత్రి చీకట్లో పయనిస్తున్నప్పుడు చటుక్కున మెరుపు మెరిసినప్పుడు లోకం అంతా ఒక్కసారి రవ్వుమన్నట్లే అనిపిస్తుంది. కథలో ఏది ఎక్కువ స్ఫుటంగా చిత్రించాలో నిర్ణయించడమే కథాశిల్పంలో ముఖ్యమైనది.కష్టమైనది. కథానికలో ప్రతి వాక్యం ప్రతిభావంతమైన చిత్రం మెరుస్తుండాలి. వైచిత్రి కథానికకు ప్రాణం.
>
> —పాలగుమ్మి పద్మరాజు




కొడుకు బాబూ... మా గురువు.. సాలా గొప్ప కొడుకుని కన్నారు. సామీ..! మేవా బాబు రునం తీర్చలేం... మా నాటోల్లకి, అంతో ఇంతో తెలివొచ్చి నాదంటే, ఆ బాబే కారనం... మాకందరికీ లోకంల జరుగుతున్నదేటో తెలిసిపోనాది.. మా బతుకుల మీద పెద్దోల్లాడుతున్న నాటకాలేటో పూరాగా తెలిసి పోనాయి. మరింక అవేటీ జరక్కుండా ఆపాలంటే, ఏటి సెయ్యాలో అది కూడా బాగానే తెలిసి పోనాది... అంచేత మేం మరింక ముందు కెల్లి పోవడమేగానీ, ఎనక్కి తగ్గేది లేదు.. నస్తే.. మేం నస్తాం.. మా పిల్లోళ్లకైనా మంచి రోజులొస్తాయి..."

లేచి నిలబడి నా దగ్గరగా వొచ్చి చెవి పక్కకు తలవొంచి చెప్పాడతను. "రేపు రాత్తిరికి సరిగ్గా పన్నెండు గంటల బండొచ్చే టయానికి 'సింతలవాగు' కాడ రెయిలు బిర్జి పేల్చేస్తం బాబూ...! బాబు దగ్గరుండి చెయ్యిస్తారీ పని... అప్పుడొస్తనని మీకు సెప్పిరమ్మనమంటే మేమిటొచ్చినం.. మరింక మే మెల్లిపోతం... దండాలు బాబూ....!"

ఆ మాటన్నాక మరాగకుండా, పొడవుగా ఉక్కుస్తంభంలా వున్న ఊలకదొర, తన సహచరుడితో బాటు లేచి వెళ్లిపోయేడు. ఆగమన్నా వినలేదు.. వర్షం వస్తుంది ఉండి పొమ్మన్నా లెక్క చెయ్యలేదు.

అతని మాటల్తో నా గుండెల్లోకి భయం ఓ ఉప్పెనలా ప్రవేశించింది.. నా కొడుకు క్రాంతి కోసం కాదు నా భయం... ఏ మార్గం అర్థరహితమని నాకర్థమయ్యిందో, ఆ దారిలోనే వాళ్లు నడవబోతున్నందుకు...

★ ★ ★

ఆ రాత్రి నాకు నిద్ర రాలేదు... ఆ రాత్రంతా వాన కూడా తగ్గలేదు. కిటికీ అద్దాల్లో నుంచి మెరుపులు వుండీ, వుండీ మెరుస్తూనే ఉన్నాయి.

గదిలో అంతా నిశ్శబ్దం.. అవును, అంతా నిశ్శబ్దమే... అట్టడుగున అలజడే నుదులు తిరుగుతోంది. అశాంతి చక్రవాకమై మనస్సముద్రాన్ని తమో మేఘ బంధురం చేస్తోంది.

క్రాంతి... క్రాంతి.. నా చిట్టి తండ్రి.. వాడికి నెనెప్పుడూ తండ్రిగా వుండలేకపోయేను.. వాడి బాల్యంలో నేనో ఆశ్చర్యార్థకం.. ఆవేశం వొడిలో అక్షరాలు దిద్దుకుంటూ, ఉద్రేకం మడుగులు అడుగులు వేస్తూ, వుండిపోయేనే తప్ప వాడి గురించి నేనెప్పుడూ పట్టించుకోలేకపోయేను..

పొడవుగా, సన్నగా సీత పోలికల్ని పుణికి పుచ్చుకున్న నా చిన్నబాబు... గుడ్డిగా అంగార మార్గంలోకి అడుగులు వేస్తూ... దూరంగా... నాకు చాలా దూరంగా... జీవితానందాలన్నింటినీ త్యాగం చేసేస్తూ వెళ్లిపోతున్నాడు... నాకప్పుడు తెలీనట్టే... వాడికిప్పుడూ తెలీటం లేదు...

ఎంత మంది బలయ్యారు.. ఎన్ని దీపాలు కొండెక్కిపోయేయి. ఎంత రక్తం ఏరులై పారింది... తలచుకుంటే గుండె చెమరిస్తోంది.

దోపిడీ... వంచన.. తప్పకుండా గర్హనీయాలే.. కొందరి చేతుల్లో ఎందరో బలికాకుండా ఆపితీరాల్సిందే... కానీ అందుకిది సరైన మార్గంకాదని నాకిప్పుడు నమ్మకంగా అనిపిస్తోంది.

కోడిపిల్లకు పందిపిల్లను దిష్టి తీసినట్టూ, కొండనెత్తి, కొమ్ము విరగ్గొట్టినట్టూ వుండకూడదు... అందుకు కావలసిన వైద్యం. ప్రాణాన్ని నైవేద్యంగా పెట్టి పూజచేస్తే... ప్రాణం పోతుంది కానీ పూజ ఫలించేదీ లేనిదీ ఎప్పటికీ తెలియదు.

తలంతా బరువెక్కిపోయింది. కళ్లు మండుతున్నాయి. ఎంత సేపటికో తెల్లవారింది. దిగులు నిండిన మనస్సుతో పక్కమీద నుండి లేచాను.

పని మనిషి వచ్చి తన పన్లు చేసుకుంటోంది. ప్రభాతం మబ్బు పరదాల వెనక భద్రంగా నిద్రపోతోంది. గదిలోంచి బయట వరండాలోకి రాగానే, వేడిగా ఉన్న శరీరానికి చల్లని ప్రత్యూంగ పవనం తాకేసరికి, నాకు జ్వరం వచ్చిందని తెలిసింది..

పోలీస్ డాక్టర్ చెప్పిన హెచ్చరిక గుర్తొచ్చింది... "మీ ఆరోగ్య పరిస్థితి బాగుండకపోవడం వల్ల మీకు విడుదల దొరికింది. ఈ వయస్సులో మీరే ఆలోచనలూ పెట్టుకోకండి... మళ్లీ స్ట్రోక్ రాకూడదు.. వస్తే మీరు మిగలరు...!"

కానీ నాకిప్పుడేం దిగుల్లేదు... ఆలోచన్ల వేడితో ఉడికిపోయిన నా మెదడులో ఓ కొత్త ఆలోచన చోటు చేసుకుంది.

వాలు కుర్చీలో నెమ్మదిగా జేరబడ్డాను. చంద్రమ్మ వేడిగా కాఫీ తెచ్చింది..

"రాత్రి అన్నం తినలేదేం బాబుగారూ...!" అనడిగింది. "లేదు చంద్రమ్మా! ఆకలి పుట్టలేదు.." అని చెప్పేనామెతో.. నాకన్న కూతుర్లా పరిచర్యలు చేస్తుందామె. ఆమె భర్త నారాయణ... దగ్గిరసా వచ్చి చెయ్యి పట్టుకు చూసింది.

"మీకు జ్వరం వొచ్చింది... బాబూ..!" అంది గాభరాగా. "మరేం ఫర్వాలేదు. చంద్రమ్మా! తగ్గిపోతుందిలే...!" అంటూ "ఈ పూట వంట ఏం చేస్తున్నావు..?" అనడిగేను మాట మారుస్తూ.. లేకపోతే ఆమె నారాయణను కేకేస్తుంది.. నారాయణ డాక్టర్ని తీసుకొస్తాడు. అదంతా నాకిప్పుడిష్టం లేదు... నా ఆలోచనలను క్రమబద్ధం చేసుకోవాలి... అందుకు నాకు తగిన సమయం కావాలి.. "మామూలేగా.. బాబూ! గోధుమన్నం.. ఉడికించిన బంగాళాదుంపలు.. చారూ, పెరుగూ... ఎందుకు బాబూ అడిగారు...?" ఆశ్చర్యం కనిపించిందామె స్వరంలో.

"కొంచెం చక్రపొంగలి కూడా చెయ్యి.. చంద్రమ్మా..! ఇవ్వాళ బాబు పుట్టిన్రోజు.. నాగుండె గొంతుకలో కొట్లాడింది... గుటక మింగుడు పడలేదు.. మళ్లీ ఓ జ్ఞాపకం...

పార్వతీపురం కుట్ర కేసులో, చేతులకీ, కాళ్లకీ గొలుసులు బంధించి... ఆ చిన్న కోర్టు ఆవరణలో నిలబెట్టినప్పుడు,... ఎంత ఉత్సాహం... కంఠం పగిలేలా... దిక్కులు వొణికేలా మా నినాదాలు...

చనిపోయారు... సత్యం పోయాడు... కైలాసమూ కలల లోకంలోకి కాలిపోయి వెళ్లిపోయాడు.. ఎన్నెన్నో మణిదీపాలు మలిగిపోయాయి. కొన్ని చెదిరి పోయాయి. నాకు మళ్లీ జైలు.. నా జీవితంలో నేను జైల్లో గడిపిన రోజులే ఎక్కువ..

తొమ్మిదేళ్ల క్రాంతి వాళ్లమ్మ చెయ్యి పట్టుకుని జైల్లోకి వచ్చాడు. కొత్త బట్టలు కట్టుకున్నాడు.. సన్నగా, చిన్న కొవ్వొత్తిలా వెలిగి పోతున్నాడు.. "ఈ వేళ వీడిపుట్టిన్రోజు.. నాన్నగారికి నమస్కారం చెయ్యరా.. బాబూ..!" అని వాణ్ణి హెచ్చరించింది సీత.. వొంగి నాకళ్లకి దణ్ణం పెట్టాడు వాడు.. దగ్గరకు తీసుకుంటే ఆర్తిగా నడుముకు చుట్టుకు పోయాడు.. వాడి పెద్ద పెద్ద కళ్లల్లో నీళ్లు నేను మొదటి సారిగా చూశాను.

"చక్రపొంగలి తెచ్చాను.. తినండి.. వీడికిష్టమని చేశాను.." స్పూన్‌తో టిఫిన్ బాక్సులోంచి తీసి నానోటికందిస్తూ చెప్పింది సీత.. అప్పటికే ఆమెకి చత్వారం జోడు చెవుల మీదకి వచ్చింది. టీచరుద్యోగం ఆమెని రాటు దేల్చినట్టుంది. విశాలమైన ఆమె నుదురు మీదున్న ఎర్రటి కుంకుమ బొట్టులో కూడా నేనప్పుడూ విప్లవ సూర్యుణ్ణే చూశాను..

"రామం బాబయ్య చెప్పాడు... ఏదో హామీ పత్రం రాసిస్తే, మిమ్మల్ని విడుదల చెయ్యొచ్చంటున్నారు..." తటపటాయిస్తూనే అంది.

నాలో ఏ మృగం ప్రవేశించిందో అప్పుడు.. "నోర్ముయ్..!" అని జైలు గోడలు ప్రతి ధ్వనించేలా కేక వేశాను.. క్రాంతి భయపడిపోయి వాళ్లమ్మ వెనకాల దాక్కున్నాడు..

ఉద్యమం జలపాతంలా ఉరికొస్తుందన్నది అప్పటి నాదృఢమైన మనో విశ్వాసం... అలానే జరిగింది...! ఎత్తు నుంచి పతనమై, పక్కదారులు పట్టిపోయింది. దాని వేగానికీ, శక్తికీ, లోబడిపోయి ఎందరో కాలగర్భంలో కలిసిపోయారు.. ముక్కు పచ్చలారని తమ్ముళ్లు, అద్భుత ప్రజ్ఞావంతులు, ముద్దులు మూటగట్టే చెల్లెళ్లు... ఎందరో... ఎందరెందరో... చిరునవ్వులు. చిందిస్తూ బుల్లెట్లకి టార్గెట్లయి పోయారు... రంగుల రాజ్యం కోసం రక్త తర్పణాలు చేస్తూ నడిచారు..

వాళ్ళ జీవితాల్లో పూర్ణచంద్రోదయాలూ, పుష్పవరి మళ పరిష్వంగాలూ, మలయానిల మోహన స్పర్శలూ... లేనేలేవు. చండ చండ సూర్యప్రతాపాలూ, రక్తంలో పొంగుతున్న ఆవేశ జలపాతాల ఝరీగమనాలూ, ఉడుకుతున్న ఆలోచనా కాసారాలు... ఇవే... ఇవే నడిపించాయి.. నడిపిస్తున్నాయి కూడా.

నాటి నుండి నేటి వరకూ యువత జీవితాన్ని అపార్థం చేసుకుంటోంది. వాళ్ళు పొడుగ్గా పెంచుకున్న జులపాల వెనుకా, వదులుగా వేళ్లాడే చొక్కాల వెనుకా ఎక్కడో తరంగిణి తప్పుగా మోగుతోంది.

నేనూ నడిచేను తప్పుగా... నేనూ నమ్మాను గుడ్డిగా... ప్రేమ... కరుణ... అభిమానం... ఆత్మీయతలకు దూరంగా... ఒంటరినై... వెలినై... ఆవేశపు ఆత్మ సింహాసనంమీద,... కంటకావృత దుర్గమ శిఖర శృంగారాల మీద.. కూర్చుని వొట్టి చేతుల్తో అగ్ని పుట్టించాలని ఒక జీవితకాలం పాటు పాకులాడుతూ గడిపాను... నా చుట్టూ నగం మెదడు వికసించిన సమూహాలు...

నాకు తెలీలేదు... భగవంతుడా...! నిజంగా నాకు





తెలీనేలేదు... నేనెంత తప్పు చేశానో...

ఒళ్ళంతా తుపాకీ తూటాల్తో నిండిపోయి ఎర్రగా ఉదయించిన నెల బాలుళ్లలా, ఏదో సాధించినట్లూ... ఈ జీవితానికి ఇదే పరమావధి అన్నట్లూ దీర్ఘ నిదుర పోతుంటే, అమరవీరులంటూ అశ్రుగీతాలు రాశానే తప్ప... అప్పుడు నా గుండె గుణింతాన్ని తప్పుగా చదువుతోందని గుర్తించనేలేకపోయాను. ఆ పాపం ఎవ్వరిదని ఆక్రోశించానే గానీ, అందులో నాకూ కొంత భాగం ఉందని తెలుసుకోలేకపోయాను.

నేనిప్పుడు పరితపిస్తున్నాను... నేను నడిచిన రుధిర మార్గం సరైంది కాదనీ... నా తుపాకీ సిద్ధాంతం తుప్పుపట్టిపోక తప్పదనీ స్పష్టంగా గ్రహించాను. ఆకలి కేకలకి, ఆఖరి మలుపు... తుపాకీ తూటా కాకూడదనీ అంతకు మించి మరో మంచి మార్గం ఉండి తీరుతుందనీ నాకర్థమవుతోంది.

ఇంక దీన్ని కొనసాగనివ్వకూడదు... అందుకు నేను కొంతైనా చేయగలిగితే, వెంటనే చేసి తీరాలి... నా చెంపల మీద కన్నీరు కాల్వలు కట్టిందని గడ్డం మీదకు జారుతున్న కన్నీటి బిందువులు తడిగా తట్టి చెప్పాయి.

నా 'క్రాంతి' కోసమేనా నాలో ఈ పరివర్తన... కాదు... కానే కాదు... ఇన్నేళ్ళ జీవితంలోనూ నా లక్ష్యం తప్ప మరేం తెలియని నాకు... ఇప్పుడు కూడా మారుతున్న నా లక్ష్యం తప్ప నా రక్త స్పర్శ ముఖ్యం కాదు...

ఆ పగలల్లా కొన్ని ముఖ్యమైన కాగితాలు చూసుకున్నాను... నా మనస్సు చెప్పిన నిర్ణయాలు తీసుకున్నాను... ఇల్లంతా తిరిగి చూసుకున్నాను. మేడమెట్లు తుడవలేదేమని చంద్రమ్మని కేకలేసాను. డాబామీద నిలబడి చూశాను. వర్షం తాత్కాలికంగా ఆగిపోవడం వల్లనేమో ఆకాశం అంచున నల్లమబ్బులతో నిండి ఉన్నా... మధ్యలో కొంతమేర నిర్మలంగా ఉండి పల్చగా సూర్యకాంతి ప్రసరిస్తోంది... కొబ్బరి ఆకులమీదనున్న తడి మెరుస్తోంది.

కిందకు దిగాక, నారాయణను ఆవరణలో నిండి ఉన్న ఆకులనూ, కొమ్మలనూ తీసెయ్యమని చెప్పాను... నాలో హుషారు చూసి నారాయణా, చంద్రమ్మా ఇద్దరూ సంతోషంగా కనబడ్డారు...

"బాబుగారికి మందులు బాగా పనిచేసినట్టున్నాయి..." అంటున్నారు. రహస్యంగా నారాయణ, చంద్రమ్మతో...

నేను హాయిగా ఫీలయ్యేను... ఔను... నేను కనుక్కున్న మందు నా మీద బాగానే పనిచేసింది.... గుండె తేలికయ్యింది.... మనసంతా ప్రశాంతంగా ఉంది.

సాయంత్రం వీధి చివర ఉన్న పార్కుదాకా వెళ్ళి కాసేపు కూర్చుని వచ్చాను...

రాత్రి తొమ్మిది గంటలదాకా కూర్చుని నేను చెయ్యాలనుకున్న మరికొన్ని పనులు పూర్తి చేశాను... ముందుగా నా పుస్తకాలు ప్రచురించే సంస్థలకు ఉత్తరాలు రాసేను... నా పుస్తకాల ప్రచురణ నిలిపివేయమనీ... నా హక్కుల్ని నేను తిరిగి తీసేసుకుంటున్నాననీ... అందుకు కావలసిన ఏర్పాట్లు చేసి... నా లాయరును సంప్రదించమనీ... లాయరుకి కూడా అన్ని విషయాలూ రాసి, పవరాఫ్ అటార్నీ జతపరిచాను... ఆ తర్వాత ఒక్కొక్కటిగా నా పుస్తకాలన్నీ కాల్చి బూడిద చేశాను.... "అగ్నిప్రవేశం... ఆత్మవీణ... చైతన్యధాత్రి... రుధిరమార్గం..." అన్నీ... ఏదీ వదల్లేదు...

టైము దగ్గరపడుతోంది... అట్టే సమయంలేదు... లేచి ఇంటి బయటకు నెమ్మదిగా వచ్చాను. వరండాలో నారాయణ నిద్రపోతున్నాడు... రేపటి నుంచి ఇల్లు తనదే అని తెలిసేక ఏమనుకుంటాడో... ఎక్కువ శబ్దం కాకుండా గేటు తీసుకుని బయటకు నడిచేను... నా భుజానికి పాత సంచీ వేలాడుతోంది. ఆప్యాయంగా తడిమేను దాన్ని... నా వంట్లో కొత్త శక్తి ప్రవహిస్తున్నట్లుగా ఉంది. దాంట్లో పత్రికలకీ, ప్రభుత్వాధికారులకీ నేను రాసిన స్టేటుమెంట్లున్నాయి. రిక్షా కేకేసి రైల్వే స్టేషన్‌కి పోనియ్యమన్నాను.

స్టేషన్లో దిగుతూనే టైము చూశాను... పదకొండూ పదయ్యింది. ఎంక్వైరీలో కనుక్కుంటే రైలు అరగంట లేటన్నారు.. చాలు... అనుకున్న దానికన్నా ఎక్కువే సమయం ఉంది... స్టేషన్లో ఉన్న పోస్ట్ బాక్స్‌లో, నా సంచీలోంచి కవర్లు తీసి పోస్టు చేశాను.

ఎంక్వైరీ నుంచి బయటకు వచ్చి పబ్లిక్ టెలిఫోన్ దగ్గరకు నడిచాను... అక్కడెవ్వరూ లేరు... నాకు బాగా తెలిసిన నెంబరు డయల్‌చేసి రెండు నిముషాలు మాట్లాడి ఫోన్ పెట్టేశాను... ఏం జరుగుతుందో ఎంత కలకలం రేగుతుందో నేను ఊహించుకోగలను.

నెమ్మదిగా ప్లాట్‌ఫారం చివరకు వచ్చి, చింతలవాగు దిశగా నడవటం మొదలుపెట్టాను... దూరం మైలుకన్నా ఎక్కువే ఉంటుంది... నెమ్మదిగా అడుగులు వేస్తున్నాను...

చుట్టూ చీకటి... ఆకాశంలో మళ్ళీ మబ్బులు మూసుకున్నాయి... మెత్తగా పూలు కురుస్తున్నట్టు చిరుజల్లు ప్రారంభమయ్యింది.

మరింక ఆలోచనల్లేవు...

రైలుదారి వెంట నడక సాగుతోంది... పట్టాల మధ్యగా నడుస్తుంటే, రాళ్ళు వేళ్ళకి తగిలి నొప్పి పుడుతోంది... నాకు అలుపు వచ్చింది... కొద్ది సేపు ఆగి మళ్ళీ నడక మొదలు పెట్టాను...

దూరంగా రోడ్డుమీద వాహనాల కాంతి... సన్నగా సైరన్ వంటి మోత... వాళ్ళు వచ్చేస్తున్నారన్న మాట...!

రైలు బాటకటూ ఇటూ పంట పొలాలు... ఆ చేల గట్లమీదున్న తాటిచెట్లు నల్లగా నీడల్లా కనిపిస్తున్నాయి... అంతా అలికేసినట్టు కనిపిస్తోంది... నాకు నా మార్గం... గమ్యం తప్ప మరేదీ నిజంగా కనిపించటం లేదు కూడా....

దూరంగా రైలు కూత...!

సమయం దగ్గరకి వచ్చేసింది... దూరంగా... మూడొందల గజాల దూరం ఉంటుందేమో... తెల్లగా బ్రిడ్జి స్తంభాలు కనిపిస్తున్నాయి...

నా కళ్ళకి సరిగ్గా కనిపించడం లేదుగానీ నా చెవులకి అస్పష్టంగా బూట్ల చప్పుళ్ళు వినిపించాయి.

ఎవరో పరుగు తీస్తున్నట్లు కూడా నా చెవులు పసిగట్టేయి... కొన్ని నీడలు వేగంగా కదిలి పోతున్నట్లనిపించింది... నేను కోరుకున్నట్టే జరుగుతోంది... ఏ ఒక్కడూ దొరికిపోకూడదు...

నెమ్మదిగా బ్రిడ్జిమీదకు వచ్చాను...

నా గమ్యం వచ్చేసింది... ఆగాను...

దూరంగా మళ్ళీ రైలు కూత... ఆగి... ఆగి... దీర్ఘంగా వినిపించింది.

నాకు తెలుసు. ఆ రైలు ఆగిపోయిందనీ, అప్పుడే కదలదనీ... అంతా అనుకున్నట్టే జరుగుతోంది.

తెల్లని నా లాల్చీ, పైజామాలు వేగంగా వీస్తున్న ఈదురుగాలికి విసురుగా కదులుతుంటే రెండడుగులు ముందుకు వేశాను...

కాలికి రాయేదో కొట్టుకుంది... బాగా నొప్పి పుట్టింది... బొటనవ్రేలి నుంచి రక్తం వస్తున్నట్టుంది... అదిమి పెట్టేందుకు కిందికి వంగాను...

నా చుట్టూ అనేక జతల కళ్ళు, నన్నే గమనిస్తూ ఉంటాయని నాకు బాగానే తెలుసు...

"ఛార్జ్" వినబడింది...

చప్పుడు లేకుండా వచ్చి మీద పడింది పోలీస్ డాగ్... పులిలా ఉందది.

నేను వెనక్కి పడిపోయాను. తలకి బలంగా దెబ్బ తగిలింది... ఎవరో పరుగెత్తుకొస్తున్నారు.. బ్రిడ్జి ఆ చివర నుంచి... బూట్ల చప్పుడు బిగ్గరగా వినబడుతోంది...

నేను లేవాలని ప్రయత్నించాను... కుక్క నా గుండెల మీద నిలబడి నన్ను కదలనివ్వటం లేదు...

ఎక్కడలేని సత్తువా తెచ్చుకుని... ఆఖరి ప్రయత్నంగా ఎడమచేత్తో దాన్ని బలంగా తోసి, నిలబడి పరుగుతీయడం ప్రారంభించాను.. వెనక్కి...

"హాల్ట్...." కేక...

నేను ఆగలేదు... కుక్క కాళ్ళకి అడ్డం పడుతోంది... పిచ్చిది... నేను నిజంగా పారిపోతాననుకుంటున్నట్టుంది... పారిపోవాల్సిన వాళ్ళకు మరింత సమయం ఇచ్చేందుకే నా ప్రయత్నం అని దానికెలా తెలుస్తుంది...?

దాన్ని తప్పించుకుంటూ ముందుకి కదిలాను...

కుక్క నన్ను లాగడంతో, నేను కింద పడిపోవటం... అప్పుడే పేలిన పిస్తోలు గుండు నా ఛాతీలోకి, నిప్పుకణిక లాగా జొరబడటం నాకు తెలిసింది. నా నొప్పి తెలీలేదు...

రేపు రాష్ట్రంలోని అన్ని పత్రికల్లో ప్రకటించబడే నా స్టేట్‌మెంట్‌తోపాటు నాకు ఆఖరి కవిత 'కన్ఫెషన్' లోని పంక్తులు, నాకే వినిపించనంత నెమ్మదిగా నా పెదాల మీద దొర్లడం మాత్రమే నాకు తెలిసింది...

విప్లవం ఒక ఉత్తమాట...!

విప్లవం ఒక నీళ్లమూట...!!

ఆ తర్వాత ఆకాశం ఒంగి నన్ను తన ఒళ్ళోకి తీసుకుంది...

